అభివృద్ధికి నమూనా 42వ డివిజన్

- రూ. 13.57 కోట్లతో మౌలిక సదుపాయాలు
- డీబీటీ ద్వారా రూ.36.39 కోట్లు
- నాన్ డీబీటీ ద్వారా రూ.9.80 కోట్లు
- రూ.2.50 కోట్లతో పార్కుల అభివృద్ధి


నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని భవానీపురం 42వ డివిజన్ అభివృద్ధికి నమూనాగా నిలిచింది. హౌసింగ్ బోర్డు ఏర్పాటైన నాటి నుంచి జరగని అభివృద్ధి కేవలం ఈ ఐదేళ్ల వ్యవధిలోనే జరగడం గమనార్హం. హెచ్‌బీ కాలనీలోని హెచ్ఐజీ, ఎంఐజీ, 450 ఎస్ఎఫ్‌టీ(వెలంపల్లి కాలనీ) ఇలా ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైన్లు నిర్మాణం జరిగి పూర్తిగా కొత్త రూపు సంతరించుకుంది. నగరంలోని ప్రధాన పార్కులకు దీటుగా డివిజన్‌లోని నాలుగు పార్కులు రూపుదిద్దుకున్నాయి. ఈ ప్రభుత్వంలో నూరు శాతం అభివృద్ధి జరిగిందని, స్థలాలు, ప్లాట్ల ధరలు రెట్టింపయ్యాయని స్థానికులు చెబుతున్నారు. స్వాతి థియేటర్ నుంచి చర్చి సెంటర్ వరకు ఉన్న ప్రధాన రహదారి క్రాంబే రోడ్డు బందరు రోడ్డును తలపిస్తోంది.

నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో...

పార్కుల స్థలాల్లో పిచ్చిమొక్కలు, పందుల స్వైరవిహారం, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండేది. ఖాళీ స్థలాల్లో చెత్తా, చెదారం, మురుగు పేరుకుపోయి దోమలు ముసిరేవి. ప్రధాన రహదారులు గుంతల మయం. వర్షాకాలంలో బురద కయ్యలు. హెచ్ఐజీ, ఎంఐజీ, 450 ఎస్ఎఫ్‌టీ, టెలిఫోన్ కాలనీ ప్రాంతాల్లో పూర్తిగా ధ్వంసమైన రోడ్లతో స్థానికులు నరకం అనుభవించేవారు.

ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.36,39,17,742 జమ

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా ఇప్పటివరకు డివిజన్‌లో మొత్తం 12,346 మంది లబ్ధిదారులకు రూ.36,39,17,742 నగదు వారి ఖాతాల్లో జమ అయింది.

నాన్ డీబీటీ ద్వారా రూ.9,80,19,589 లబ్ధి

నాన్ డీబీటీ ద్వారా డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం 4,060 మంది లబ్ధిదారులకు రూ.9,80,19,589 మేరకు ప్రయోజనం కలిగింది. వీటిలో ప్రధానంగా 116 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల కేటాయింపు ద్వారా రూ. 1,46,79,916 మేరకు లబ్ధి పొందారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

పార్కులు పచ్చదనం సంతరించుకున్నాయి. చక్కటి వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, షటిల్ కోర్టులు, పిల్లల ఆటవస్తువులు ఏర్పాటయ్యాయి. విద్యుత్ కాంతులతో నూతన శోభను సంతరించుకున్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం వందలాది మంది పార్కుల్లో సేదతీరుతున్నారు. విశ్రాంత ఉద్యోగులు పార్కుల్లో సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ప్రధాన రహదారులు విస్తరించారు. ఆక్రమణలు తొలగించారు. బీటీ రోడ్లు వేశారు. ట్రయాంగిల్ పార్క్ రోడ్డు, హౌసింగ్ బోర్డు ప్రధాన రహదారి, రైతు బజారు ప్రధాన రహదారి, టెలిఫోన్ కాలనీ, లలిత నగర్, పోలీసు కాలనీ, ఓల్డ్ ఎంఐజీ రోడ్డు అభివృద్ధి చేయడంతో జాతీయ రహదారులను తలపిస్తున్నాయి. అంతర్గత రోడ్లు సీసీ రోడ్లు వేశారు. సీసీ డ్రైన్లు నిర్మించారు. కల్వర్టులు నిర్మాణం చేసి రోడ్లను అనుసంధానం చేశారు. ఐదేళ్ల కిందట ఈ ప్రాంతాన్ని చూసిన వారు నేడు వచ్చిన మార్పును చూసి ఆశ్చర్యానికి గురవుతారంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రాంత అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది.

అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది



అభివృద్ధి విషయంలో గతానికి ఇప్పటికీ వందరెట్లు తేడా ఉంది. ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతం నూరు శాతం అభివృద్ధి చెందింది. మాస్ ఏరియా కాస్తా క్లాస్ ఏరియాగా మారిపోయింది. గజం రూ.30 వేలు పలికిన స్థలాల ధరలు రూ.70 నుంచి రూ.80వేలు పలుకుతోంది. మా టెలిఫోన్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి లైట్లు వ్యవస్థ మెరుగుపడింది. డివిజన్‌లో ఏ మూలకు వెళ్లినా అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది.

– పువ్వాడ వెంకటేశ్వరరావు, వ్యాపారి

మార్పు స్పష్టంగా చేసి చూపించాం



మా ప్రభుత్వ నినాదమే అభివృద్ధి, సంక్షేమం. ఇచ్చిన, ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తూ అభివృద్ధిలో దూసుకుపోతున్నాం. డివిజన్‌లో బీటీ, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మించాం. పార్కులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశాం. ప్రజలే నాటికి నేటికి తేడా చర్చించుకుంటున్నారు. డివిజన్‌ను అభివృద్ధికి నమూనాగా మార్చేశాం. ప్రతి రోడ్డు బందరు రోడ్డును తలపిస్తోంది.

– పడిగపాటి చైతన్యరెడ్డి, కార్పొరేటర్


విశాలంగా, అందంగా ముస్తాబైన హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారి


వెలంపల్లి కాలనీలో నాడు మురుగు గుంత స్థానంలో నేడు అందమైన పార్క్

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి

వీరాంజనేయ దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణం


నూతన పాలక మండలితో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆసిఫ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు మరింత సేవ చేసుకోవడంతో పాటు ఆలయాల అభివృద్ధికి పాటుపడాలని పశ్చిమ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. నూతన పాలక మండలి చైర్మన్‌గా వంశపారంపర్య ధర్మకర్తగా నందిపాటి శ్రీనివాసరావు, ధర్మకర్తలుగా చలమలశెట్టి జగదీష్, అయితా మాణిక్యాలరావు, పోతిన గాయత్రి, యలమంచిలి భవాని, పువ్వుల తులసి, గుర్రం బేబీ స్వప్న, ఎక్స్ అఫీషియో సభ్యునిగా విన్నకోట శ్రీనివాసరావు శర్మలచే ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులకు షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, మరుపిళ్ళ రాజేష్ పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. దేవస్థాన అభివృద్ధిలో నూతన పాలక మండలి భాగస్వాములు కావడంతో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కూరాకుల నాగ, మజ్జి శ్రీనివాసరావు, దేరంగుల వెంకట రమణ, అయితా కిశోర్, దుర్గ, ప్రభుదాస్‌లతో పాటు వివిధ కార్పొరేషన్లకు చెందిన డైరెక్టర్లు పాల్గొన్నారు.

నిరంతర సాధనే విజయానికి సోపానం

విజయవాడ కల్చరల్: నిరంతర సాధనే విజయానికి సోపానమని రాగలహరి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు బి.మీరాకుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద మృదుమధుర సంగీతం –సినీ సంగీత వైభవం పేరుతో మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా

టీడీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయం

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల

భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వస్తాయా....జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎప్పుడు చేద్దామా అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటన చేస్తూ త్వరలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అడ్రస్ గల్లంతవడం ఖాయమని స్పష్టం చేశారు. మొన్న తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు ఆశించినంత జనం హాజరు కాకపోవడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నిరుత్సాహంతో నోరు అదుపుతప్పి మాట్లాడారని అన్నారు. పవన్ కల్యాణ్ చంద్రబాబుతో కలిసి సభ నిర్వహించడం వలనే కాపులు పాల్గొనలేదని తెలిపారు. జెండా సభ మొత్తం ఆత్మస్తుతి, పరనింద మాదిరిగా తయారయ్యిందని అన్నారు. ముఖ్యంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మాట్లాడిన భాషను చూసి ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలే అసహ్యించుకున్నారని తెలిపారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చాలా మంది కాపులు వైఎస్సార్ సీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో కుప్పం నియోజకవర్గానికి నీళ్లు తీసుకువచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దెబ్బకు చంద్రబాబు మైండ్ బ్లాంక్ అయిందన్నారు.

ధైర్యంతో ముందుకు సాగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగినప్పుడే విజయాలను అందుకుంటారని ప్రముఖ క్రీడాకారిణి ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్తి గీత అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల 16వ స్పోర్ట్స్ డే వేడుకలను శుక్రవారం కళాశాల ఆవరణలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గడిచిన విద్యా సంవత్సరంలో నిర్వహించిన పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సత్తి గీత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు పాటుపడాలన్నారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో తమ విద్యార్థులు పలు బహుమతులను సాధించటం ఆనందంగా ఉందన్నారు. కళాశాల కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం కళాశాల ఫెట్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సందడి కనిపించింది. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు. క్రీడా విభాగాధిపతి విక్టర్ జాన్సన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయం



విజయవాడ కల్చరల్: సినీ నిర్మాత, దర్శకుడు ఒమ్మి రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయమని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్మాత దర్శకుడు ఒమ్మి రమాశంకర్, కళాపోషకుడు జిలానీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ రమాశంకర్ దర్శకునిగా యువ నటులు కొందరిని తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. విశ్రాంత ఐటీసీ అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ రమాశంకర్ నగరానికి వచ్చిన అనతికాలంలోనే గాయనీ గాయకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ తన మురగా చారిటబుల్ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం చేశారని, నిర్మాత, దర్శకత్వం వహించిన అరణ్య సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

రెడ్డి సామాజిక వర్గం జగన్‌కు అండగా నిలవాలి

ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గం మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భవానీపురంలో రెడ్డి సామాజిక వర్గ ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరలా వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఓసీ యూత్ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలనేదే ప్రజల ఆకాంక్ష

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్


డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేసి పథకాలు వివరిస్తున్న షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. వలంటీర్ వ్యవస్థ చక్కగా పనిచేస్తోందని, ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒక్క డివిజన్‌లోనే రూ.25 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించారని నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. బీటీ, సీసీ రోడ్లు, డ్రైన్లు, వాటర్ పైపులైన్లు నిర్మాణం చేపట్టారన్నారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గంలోని 43వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయని ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెబుతున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందిస్తున్నారని అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నామని, తమ పిల్లలు ప్రభుత్వ పథకాలతో చక్కగా చదువుకుంటున్నారని ఎక్కడికక్కడ ప్రజలు తమకు ఎదురు వచ్చి చెబుతున్నారన్నారు.

పవన్ కళ్యాణ్ దిగజారిపోయారు

పవన్ కళ్యాణ్ కేవలం 24 సీట్లు తీసుకుని రాజకీయంగా దిగజారిపోయారన్నారు. అటువంటి వ్యక్తి జగన్‌ను అధఃపాతాళానికి తొక్కుతాననటుంటే ప్రజలతో పాటు జనసైనికులు కూడా ఆయన తీరు చూసి నవ్వుకుంటున్నారన్నారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 కు 175 అసెంబ్లీ స్థానాలు గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు పుణ్యశీల, మనోజ్ కొఠారి, కార్పొరేటర్లు ఇర్ఫాన్, అప్పాజీ, చైతన్య రెడ్డి, ఆంజనేయ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీఆర్, హయాత్, చాము, బాజీ బాబా, సాంబిరెడ్డి ఎస్వీ రెడ్డి, మున్నా, డి కృష్ణారెడ్డి, కె.రత్నం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్


ఆసిఫ్‌ను సత్కరిస్తున్న ముస్లిం మైనార్టీ పెద్దలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసి గౌరవిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మైనార్టీలంతా రుణపడి ఉంటారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. శుక్రవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్‌తో కలిసి స్థానిక రజా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం జగనన్న తనకు పశ్చిమ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందున అందరూ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. షాదీ తోఫా, హజ్ యాత్రకు తగిన సదుపాయాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన సీఎం జగనన్న మైనార్టీల పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ 'చెప్పాడంటే.. చేస్తాడంతే' అన్న నానుడి సీఎం జగనన్నతోనే వచ్చిందన్నారు. మైనార్టీలంతా ఏకతాటిపై నిలిచి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, బాజీ బాబా, అఫ్సర్, రసూల్ ఖాన్, షేక్ ఖీం, అబ్దుల్ రఫీ, ఎండీ గౌసీ, కరిముల్లా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్‌ను స్థానిక ముస్లిం పెద్దలు సత్కరించారు.

సెలూన్ నిర్వహణ, సంగీత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య


సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య, చిత్రంలో భీమశంకరరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేటి తరానికి అనుగుణంగా ఆధునిక సెలూన్ నిర్వహణ నిమిత్తం తిరుపతిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో నాయీబ్రాహ్మణ యువత కోసం సంగీత శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శుక్రవారం కార్పొరేషన్ బోర్డు మీటింగ్ జరిగింది. ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ భీమశంకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అజెండాలోని పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ తొండమల్లు పుల్లయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన తీర్మానాలపై సమీక్షించామని తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, నాయీబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ కర్పూరి ఠాకూర్‌కు ఇటీవల భారతరత్న పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో ఆయన జయంతి లేదా వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలన్న అంశంపై చర్చించారు. నాయీబ్రాహ్మణ సామాజిక వర్గం అవసరాల కోసం తిరుపతిలో స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించానని పుల్లయ్య పేర్కొన్నారు.

ముస్లిం మైనార్టీలంటే ప్రేమ ఇదేనా 'బొండా'!





బొండా ఉమాకు వ్యతిరేకంగా సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు ; ముస్లిం మైనార్టీలను పిలవకుండా వేదికపై మాట్లాడుతున్న బొండా ఉమా

- టీడీపీ సమావేశంలో ముస్లిం మైనార్టీలకు ఘోర అవమానం
- సమావేశ వేదికపైకి ముస్లిం మైనార్టీలను పిలవని వైనం
- బయటకు వచ్చి వేరుగా సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు
- అక్కడ కేవలం ఒక వర్గానికి, జనసేన వారికి మాత్రమే ప్రాధాన్యం
- తమను అవమానించిన వారికి గుణపాఠం చెబుతామని ముస్లిం మైనార్టీ నేతల హెచ్చరిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీలో ముస్లిం మైనార్టీలకు ఘోర అవమానం జరిగింది. ఆ పార్టీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సింగ్‌నగర్ పైపులరోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో వేదిక పైకి నియోజకవర్గంలోని ప్రధాన నాయకులందరినీ పిలిచి కూర్చోబెట్టుకున్నప్పటికీ ముస్లిం మైనార్టీ నాయకులను మాత్రం వేదికపైకి ఆహ్వానించలేదు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ముస్లిం మైనార్టీ నాయకులంతా కార్యక్రమం జరుగుతుండగానే అక్కడి నుంచి బయటకు వచ్చేసి సింగ్‌నగర్‌లో వేరుగా సమావేశమయ్యారు. ఈ సన్నివేశాన్ని చూసిన వారంతా ముస్లిం మైనార్టీలపై నీకున్న ప్రేమ ఇదేనా బొండా ఉమా అంటూ ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేటర్ స్థాయి లేని వారిని కూడా...

టీడీపీ సమావేశంలో కనీసం కార్పొరేటర్ స్థాయి లేని వ్యక్తులను కూడా పిలిచి వేదిక పైన కూర్చోబెట్టుకున్నారని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముస్లిం మైనార్టీలను మాత్రం వేదికపైకి పిలవకపోవడం చాలా బాధగా ఉందని టీడీపీలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఆది నుంచి ముస్లిం మైనార్టీలంటే టీడీపీ పెద్దలు చులకనగా చూస్తున్నారని, ఎన్ని అవమానాలు ఎదురైనా వాటిని భరించి ముందుకు వెళ్తుంటే ఈరోజు ఇతర వర్గాల వారి ముందు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ముందు తమను ఘోరంగా అవమానించారంటూ అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది కావాలనే ముస్లిం మైనార్టీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఇన్ని జరుగుతున్నా అధిష్టానం పట్టీపట్టనట్లు చూస్తుందే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ముస్లిం మైనార్టీల పవర్ అంటే ఏంటో వారికి కచ్చితంగా అర్థమయ్యేలా చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.

కష్టపడిన వారికి విలువలేదా?

గత ఐదేళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడుతూ, పార్టీ కార్యక్రమాలకు తమ సొంత డబ్బులను వేసుకుని చేస్తున్న నాయకులను కాదని బొండా ఉమా ఇప్పుడు కొత్తగా వచ్చిన వారికి విలువ ఇవ్వడం బాధాకరంగా ఉందని ముస్లిం మైనార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా పోటీచేయని వారిని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కనీసం ముందుకు రాని వారినందరినీ వేదికపైకి ఎక్కించి పూలదండలు, శాలువాలు కప్పుతుంటే మాలాంటి నిజాయితీ గల ముస్లిం నాయకులు వేదిక కింద కూర్చోవాలా అంటూ కలత చెందారు. నిన్న కాక మొన్న వచ్చిన జనసేన నాయకులకు ఇచ్చిన విలువ కూడా పార్టీలో తమకు ఇవ్వడం లేదని, ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న టీడీపీకి, బొండా ఉమాకు పని చేసేది లేదంటూ కొంతమంది మైనార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముస్లిం నాయకులమంతా సమావేశం నిర్వహించుకుని తమ భవిష్యత్‌కు ఉపయోగపడే నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆపాత మధురాలు సంగీత కార్యక్రమం సినీ క్లాసికల్ విశిష్టతను చాటింది. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం లాంటి సంగీత కళాకారులు అరుదుగా కనిపిస్తారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాస్టారని, బాలసుబ్రహ్మణ్యం వివిధ భారతీయ భాషలలో 50 వేలకు పైగా పాటలు పాడారని గుర్తుచేశారు.